



రాయదుర్గంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

భక్తిశ్రద్ధలతో బక్రీద్

- ఈద్గాల్లో ముస్లిముల ప్రత్యేక ప్రార్థనలు
- పలువురి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-అనంతపురం

ఉమ్మడి అనంతపురం వ్యాప్తంగా బక్రీద్ వేడుకలను ముస్లిములు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శనివారం ఉదయాన్నే కొత్త దుస్తులు ధరించి ఈద్గా మైదానాలకెళ్లి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. సర్వమానవాళి శాంతి, సుఖ సంతోషాలతో మెలగాలని కోరుకున్నారు. ప్రార్థనల అనంతరం ఖుర్బానీ ఇచ్చి మాంసాన్ని పంపిణీ చేశారు. అనంతపురం నగరంతో పాటు గుత్తి, తాడిపత్రి, గుంతకల్లు, సత్యసాయి జిల్లాలో హిందూపురం, పెనుకొండ, కదిరి, ధర్మవరం పట్టణాల్లోని ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు ముస్లిములకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. సోదరభావంతో పండుగలను అందరూ కలసిమెలసి చేసుకోవాలని ఆకాంక్షించారు.



గొర్రెల పెంపకం క్షేత్రంపై నీలినీడలు

- కాగితాలకే పరిమితమైన శిక్షణకేంద్రం
- వేలల్లో ఉన్న గొర్రెలు..నేడు వందల్లోకి..!
- వేధిస్తున్న నిధులు, సిబ్బంది కొరత
- వందల ఎకరాల భూములు ధారాదత్తం

ప్రజాశక్తి-పెనుకొండ

ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయం తర్వాత జీవాల పెంపకంపై ఆధారపడి రైతులు జీవిస్తున్నారు. అందులో గొర్రెల పెంపకం ముఖ్యమైనది. చాలా మంది దీనిపై ఆధారపడి ఇప్పటికీ సంప్రదాయ పద్ధతిలో గొర్రెల పెంపకాన్ని చేపడుతున్నారు. ఉమ్మడి అనంతలో 49లక్షల గొర్రెలు ఉన్నాయి. 44వేల కుటుంబాలు గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్నారు. పెరిగిన అవసరాలు, మారుతున్న కాలానికి అనుగుణంగా గొర్రెల పెంపకంలో రైతులకు శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుతం ఆ దిశగా ప్రభుత్వాలు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంతో రానురాను గొర్రెల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతూ పోతోంది. గొర్రెల పెంపకందారుల కోసం పెనుకొండ గొర్రెల పెంపక క్షేత్రంలో శిక్షణకేంద్రాన్ని ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఏళ్లుగా ఉంది. గత ప్రభుత్వంలో శిక్షణకేంద్రానికి రూ.2.50కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ప్రకటన వరకు బాగానే ఉన్నా ఒక్క రూపాయి కూడా అప్పటి ప్రభుత్వం విదిల్చిన దాఖలాలు లేవు. కేవలం కాగితాలకే ఆ ప్రకటన పరిమితమైంది. కూటమి ప్రభుత్వమైనా గొర్రెల పెంపక క్షేత్రం అభివృద్ధికి చేయూతనందిస్తుందని ఈప్రాంత రైతులు ఆశగా ఉన్నారు.

పెనుకొండలో గొర్రెల పెంపక క్షేత్రం

ఉమ్మడి అనంతపురం జిల్లా ఉన్న సమయంలో పెనుకొండ సమీపంలో 1959లో 578 ఎకరాల విస్తీర్ణంలో గొర్రెల పెంపక క్షేత్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతం ఆస్ట్రేలియా తరహా వాతావరణం ఉంటుందనే ఉద్దేశంతో ఇక్కడ దానిని నెలకొల్పారు. గొర్రెలకు అవసరమైన షెడ్లు, సిబ్బంది నివాసాలు నిర్మించారు. ఈ భూముల్లోనే గొర్రెలకు గడ్డి సాగు చేసే ఏర్పాటు చేశారు. ఇక్కడి వాతావరణ పరిస్థితులను తట్టుకుని జీవించే విదేశీ జాతులను ఈ క్షేత్రంలో పెంపకం చేయవచ్చు. ప్రస్తుతం నెల్లూరు బ్రౌన్‌జాతి గొర్రెలను ఈ క్షేత్రంలో పెంచుతున్నారు.



పెనుకొండ షీఫారంలోని గొర్రెలషెడ్లు

శిక్షణ కేంద్రం కాగితాలకే పరిమితం

పెనుకొండలో గొర్రెల పెంపకంపై రైతులకు శిక్షణ ఇచ్చి ఆర్థికంగా అభివృద్ధి చేసే దిశగా గతప్రభుత్వం రూ.2.50 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు ప్రకటించింది. ప్రకటన చేసినా ఐదేళ్లల్లో ఒక్క రూపాయి కూడా ఇచ్చిన దాఖలాల్లేవు. శిక్షణ కేంద్రం ఏర్పాటు కేవలం కాగితాలకే పరిమితమైంది. కూటమి ప్రభుత్వంలోనైనా శిక్షణకేంద్రం ఏర్పాటు చేసి రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తుందని ఆశగా రైతులున్నారు.

గొర్రెల పెంపక క్షేత్రం ఏర్పాటు లక్ష్యం

పెనుకొండ గొర్రెల పెంపక క్షేత్రంలో ఫ్రెంచ్, మెరినో, కరిడేల్, బళ్లారి(డక్కన్) జాతికి చెందిన గొర్రెలను పెంచాలని సంకల్పించారు. వీటితో సంతానోత్పత్తి చేసి ఆ పిల్లలను రైతులకు అమ్మడానికి వీలుగా దీనిని ఏర్పాటు చేశారు. గొర్రెల ద్వారా లభించే ఉన్నితో నాణ్యమైన ఉన్ని వస్త్రాలు తయారు చేయాలని భావించారు. వాతావరణంలో అనూహ్య మార్పులు కారణంగా ఈజాతి గొర్రెలు అభివృద్ధి చెందలేదు. దీంతో నెల్లూరు బ్రౌన్‌జాతి గొర్రెల పెంపకం చేపట్టారు.

వేధిస్తున్న నిధులు, సిబ్బంది కొరత..

గొర్రెల పెంపక క్షేత్రంలో గతంలో వేలసంఖ్యలో గొర్రెల పెంపకంచేపట్టేవారు. ప్రస్తుతం కేవలం 600 మాత్రమే ఉన్నాయి. 8 మంది సిబ్బంది ఉండాలి. ప్రస్తుతం డీడీ, సీనియర్ అసిస్టెంట్, టైపిస్టు, మరో ఇద్దరు సిబ్బంది ఉన్నారు. గొర్రెలను మేపడానికి 20 మంది దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు. గొర్రెలు అనారోగ్యం, వ్యాధుల బారినపడితే చికిత్స అందించేదుకు వైద్యుడు లేరు. ఉన్న వైద్యుడు బదిలీపై వెళ్లి రెండేళ్లు గడుస్తున్న మరో వైద్యున్ని ప్రభుత్వం నియమించలేదు. మరో పక్క గొర్రెల పెంపక క్షేత్రం అభివృద్ధికి ప్రభుత్వం నిధులు నామామాత్రంగా విడుదల చేస్తోంది. దీంతో లక్ష్య సాధనకు అమడదూరంలో ఈ గొర్రెల పెంపకక్షేత్రం ఉంది. గతంలో గొర్రెల అభివృద్ధి చేసి అమ్మకాలు చేయడంతో నిధులు విరివిగా ఉండేవి. ప్రస్తుతం ఆదరణ కోల్పోవడంతో నిధులు కొరత తీవ్రంగా ఉంది. 2015-16లో ఈ క్షేత్రం అభివృద్ధికి రూ.25 లక్షలు నిధులను ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో గొర్రెలు, పొట్టేళ్లు కొనుగోలు, షెడ్ల మరమ్మతులు చేపట్టారు.



షీఫాం భూములు

వేలల్లో ఉన్న గొర్రెలు.. నేడు వందల్లోకి..

గొర్రెల పెంపకం క్షేత్రంలో గతంలో గొర్రెలతో కళకళలాడుతుండేది. వేల సంఖ్యలో గొర్రెలు, సిబ్బందితో ఎంతో ప్రాచుర్యం పొందింది. ప్రస్తుతం ఆదరణ కొల్పోయి కళావిహీనంగా మారిపోయింది. వేల సంఖ్యలో గొర్రెలు ఉండే క్షేత్రం నేడు వందల్లోకి దిగజారిపోయింది. గొర్రెల షెడ్లు, సిబ్బందినివాస గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

వందల ఎకరాల భూములు ధారాదత్తం

గొర్రెల పెంపకక్షేత్రానికి సంబంధించి 578 ఎకరాల భూమి ఉంది. అందులో వందల ఎకరాలు ఇతర అవసరాలు ధారాదత్తం చేశారు. దీనిని సంబంధించిన భూమిన ఇతర వాటికి కేటాయించడం చూస్తే షీఫారం అభివృద్ధిపైఏమాత్రం చొరవ ఉందో అర్థమౌతుంది. వైద్య కళాశాలనిర్మాణంకు 58 ఎకరాలు, యంఏజీ లేఅవుట్‌కు 32 ఎకరాలు, గిరిజన గురుకుల పాఠశాలకు ఆరు ఎకరాలు తీసుకున్నారు. ప్రస్తుతం పెనుకొండ పరిధిలో ఏ ప్రభుత్వ కార్యాలయాలకు భూమి కావాలన్న ఈ క్షేత్రం భూములనే అధికారులు సిఫార్సు చేస్తున్నారు. ఫలితంగా గొర్రెల పెంపక క్షేత్రం ప్రధాన లక్ష్యం నీరుగారిపోతోంది.



షీఫాంలో ఉన్న గొర్రెలు

అభివృద్ధిపై ప్రభుత్వం స్పందించాలి



గొర్రెల పెంపక క్షేత్రం అభివృద్ధిపై ప్రభుత్వం స్పందించి నిధులు కేటాయించాలి. పూర్తిస్థాయిలో క్షేత్రం అభివృద్ధి అయితే రైతులు, కూలీలకు ఉపాధి అవకాశాలు పెరుతాయి. క్షేత్రం భూమిని ఇతర అవసరాలకు కేటాయింపులు చేయరాదు. ఫలితంగా గొర్రెల పెంపకం కోసం గ్రాసం కొరత రాదు. ఇప్పటికే వందల ఎకరాలు ఇతర అవసరాలకు ప్రభుత్వం కేటాయించింది. అయ్యప్పన్ కమిటీ సిఫార్సులను ప్రభుత్వం అమలు చేయాలి. అరకొర గొర్రెల పెంపకం చేయకుండా పూర్తిస్థాయిలో పెంపకం చేపట్టాలి. రైతులకు అవసరమైన గొర్రెపిల్లలను ఉత్పత్తి చేసి అందించాలి.

హరి, ఏపీ రైతుసంఘం నాయకులు.

తిమ్మంపేట వద్ద రోడ్డు ప్రమాదం

ఒకరు మృతి.. పది మందికి గాయాలు
ముగ్గురి పరిస్థితి విషమం
మృతి చెందిన, గాయపడిన వారంతా వ్యవసాయ కూలీలు

ప్రజాశక్తి -అనంతపురం

అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం తిమ్మంపేట దగ్గర జాతీయ రహదారి 44పై శనివారం రాత్రి 10 గంటల సమయంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పది మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతి చెందిన, గాయపడిన వారంతా వ్యవసాయ కూలీలు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. గార్లదిన్నె మండలం ఎగువపల్లి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు చీని పంట కోత పనులను పూర్తి చేసుకుని శనివారం సాయంత్రం బొలెరో వాహనంలో ఇంటికి బయల్దేరారు. వాహనం తిమ్మంపేట వద్దకు రాగానే ఎదురుగా బొలేరో వహనాన్ని లారీ ఢీకొంది. ఆ సమయంలో బొలేరో వాహనంలో 30మంది వరకు కూలీలు ఉన్నారు. ఈ ఘటనలో మంగమ్మ(47) వ్యవసాయ కూలీ అక్కడికక్కడే మతి చెందింది. పదిమంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే చికిత్స నిమిత్తం అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు. గార్లదిన్నె పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి : ఓ.నల్లప్ప సిపిఎం జిల్లా కార్యదర్శి.

రోడ్డు ప్రమాదంలో మరణించిన మతుల కుటుంబాలకు రూ.20 లక్షలు పరిహారం చెల్లించాలి. గాయపడిన వారికి ప్రభుత్వమే మెరుగైన వైద్యసేవలు అందించాలి. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలవాలి.



ప్రమాద ఘటన స్థలంలో పడి ఉన్న క్షతగాత్రులు

అత్యాచార నిందితులను శిక్షించాలి

బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలి -ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి



నిరసన తెలుపుతున్న ఐద్వా, కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లి గ్రామంలో మైనర్ బాలికపై అత్యంత పాశవికంగా అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి వి.సావిత్రి, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతురు పరమేష్ డిమాండ్ చేశారు. మైనర్ బాలికపై అత్యాచారం చేసిన నిందితులను శిక్షించి, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని డిమాండ్ చేస్తూ ఐద్వా, కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం టవర్ క్లాక్ సర్కిల్ వద్ద నిరసన తెలిపారు. సప్తగిరి సర్కిల్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6 నెలలుగా మైనర్ బాలికపై 14 మంది పాశవికంగా అత్యాచారానికి పాల్పడ్డారని తెలిపారు. నిందితుల వికృత చర్య సమాజానికి సిగ్గు చేటుగా ఉందన్నారు. బాలిక కుటుంబానికి సదరు నిందితుల మద్దతుదారులు బెదిరించి గ్రామం వదలి వెళ్లాలంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోందన్నారు. మహిళా మంత్రి, మహిళా ఎమ్మెల్యే ఉన్న నియోజకవర్గంలో ఇలాంటి ఘటన జరగడం విచారకరం అన్నారు. మహిళా హోం శాఖ మంత్రి ఉన్నప్పటికి రాష్ట్రంలో తరుచూ మహిళలు, బాలికలపై అత్యాచారాలు చోటు చేసుకుంటున్నా చర్యలు మాత్రం చేపట్టకపోవడం సిగ్గుచేటన్నారు. మైనర్ బాలిక ఘటనను ప్రధాన రాజకీయ పార్టీలు స్వార్థ రాజకీయాలకు వినియోగించడం నీచమైన చర్య అన్నారు. ఈ ఘటనలో ఏ పార్టీ వారు ఉన్నా వారిని శిక్షించాలన్నారు. విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేయడం ద్వారా ఇలాంటి దుర్మార్గ ఘటనలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. మద్యాన్ని, పోర్న్ వీడియోలను పూర్తిగా నిషేధించాలన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి నిందితులకు కఠిన శిక్ష పడేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు చంద్రిక, అశ్విని, గీత, కెవిపిఎస్ నాయకులు అక్కులప్ప, రాజా, డేవిడ్, ఎస్ఎఫ్ఐ పట్టణ ఉపాధ్యక్షుడు జయవర్ధన్, సోము తదితరులు పాల్గొన్నారు.

పాశవిక ఘటన : రాంభూపాల్



శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాల పల్లిలో గ్రామంలో దళిత బాలికపై జరిగిన అత్యాచారం అత్యంత పాశవికమైనదని, ఇందుకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్ విమర్శించారు. శనివారం స్థానిక గణేనాయక్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సంఘటనకు కారణమైన వారు ఏ పార్టీకి చెందిన వారైనా కఠినంగా శిక్షించాలన్నారు. పేదరికం, సామాజిక వెనుకబాటును అవకాశంగా తీసుకుని దళిత మహిళపై ఆరు నెలలుగా 14 మంది అత్యాచారానికి పాల్పడడం సభ్య సమాజానికి సిగ్గుచేటు అన్నారు. నిస్సహాయ బాధిత మహిళకు అండగా నిలవాల్సిన సమయంలో ప్రధాన రాజకీయ పార్టీలు పరస్పర విమర్శలు చేసుకోవడం నిందితులకే తోడ్పడుతుందని గుర్తించాలన్నారు. ఈ దుర్మార్గ సంఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించి, బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నిందితులకు కఠిన శిక్షలు పడే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

'వాటిని అలా పరిశీలన చేయం'..!

పొడవు, వెడల్పు, గేజు మాత్రమే చూస్తాం - కార్పొరేషన్ పుష్‌కార్ట్స్‌పై జెఎన్‌టియు క్వాలిటీ కంట్రోల్ అధికారి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

'వీల్‌బార్ పుష్ కార్ట్ పొడవు, వెడల్పు, పెయింటింగ్, రేకు గేజ్ మాత్రమే చూస్తాం. వీల్‌బార్ పుష్‌కార్ట్ ఎంత బరువు మోస్తుంది.. పనితీరు, సామర్థ్యం ఉందా.. అన్న అంశాలు తాము పరిశీలించం' అంటూ జెఎన్‌టియు క్వాలిటీ కంట్రోల్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.ఓంప్రకాష్ ప్రజాశక్తికి తెలియజేశారు. శనివారం నాడు ప్రజాశక్తి దినపత్రికలో 'నిబంధనలకు తిలోదకాలు నాసిరకం పరికరాలకు జెఎన్‌టియు క్వాలిటీ కంట్రోల్ సర్టిఫికెట్ జారీ' అన్న కథనంపై అసిస్టెంట్ ప్రొఫెసర్ డా॥బి.ఓంప్రకాష్ స్పందించారు. పరికరాలకు సంబంధించి రేకు పొడవు, వెడల్పు, పెయింటింగ్, రేకు గేజ్ అంశాలను మాత్రమే పరిశీలించి సర్టిఫికెట్లు జారీ చేస్తామని ఆయన చెప్పుకొచ్చారు.

ఇటీవల అనంతపురం కార్పొరేషన్ రూ.34 లక్షలతో కొనుగోలు చేసిన కాలువల్లో మట్టి, చెత్తను తీసుకెళ్లే పుష్‌కార్ట్స్ (లాగుడు బండి) నాశిరకంగా ఉండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షాకీర్ హుస్సేన్ టెండర్ అంచనా వ్యయం పత్రంపై మేయర్ అప్రూవల్ జనరల్ ఫండ్ కింద 38:50 లక్షల రూపాయలకు ఇచ్చారు. అంచాన మొత్తం సాంకేతికంగా మంజూరు చేయగా టిఎస్ నంబర్:66/జి ఎఫ్/ఈఈ బి1/24బి25పై తేది:6-1-24న సంతకం చేశారు. ఈ మేరకు 2025 మే నెలలో జెఎన్‌టియు ప్రిన్సిపాల్ చెన్నారెడ్డికి వీల్‌బార్స్ పుష్ కార్ట్స్‌పై క్వాలిటీ కంట్రోల్ టెస్టు జరిపి సర్టిఫికెట్ జారీ చేయాలని కోరుతూ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షాకీర్ హుస్సేన్ లేఖ పంపారు. ఈ లేఖను ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి పరిశీలించి మొదట సివిల్స్ విభాగం, తరువాత మెకానికల్ హెడ్ పరీక్షలు చేయాలని సూచిస్తూ పంపారు. ఈ లేఖపై మే 21వ తేదీన జెఎన్‌టియుకు చెందిన మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం హెడ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా॥బి.ఓంప్రకాష్ కార్పొరేషన్‌కు వచ్చిన వీల్ బార్స్ పుష్ కార్ట్స్‌ను పరిశీలించి క్వాలిటీ కంట్రోల్ టెస్ట్ జరిపారు. అనంతరం సర్టిఫికెట్‌ను కాంట్రాక్టర్ కె.తరుణ్ కుమార్ తీసుకున్నట్లు సంతకం తీసుకుని ఆయనకు ఇచ్చారు. నిబంధనల ప్రకారం క్వాలిటీ కంట్రోల్ టెస్ట్ పరీక్ష జరిపిన తర్వాత ఆ సర్టిఫికెట్‌ను అధికారికంగా కార్పొరేషన్‌కు పోస్టు ద్వారా పంపాల్సి ఉంది. దీనిని కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరిశీలించి టెక్నికల్ విభాగానికి పంపుతారు. అక్కడి టెక్నికల్ ఆఫీసర్ క్వాలిటీ కంట్రోల్ టెస్ట్ సర్టిఫికెట్‌ను సంబంధిత టెండర్ ఫైల్‌కు జత చేసి పంపుతారు. పుష్‌కార్ట్‌ల పరిశీలనలో ఇలాంటివి ఏవీ పాటించకుండా నేరుగా కాంట్రాక్టర్‌కు తనిఖీ పత్రాన్ని ఇవ్వడంతో పారదర్శకత తనిఖీ లోపించినట్లు అయ్యింది. జెఎన్‌టియు క్వాలిటీ కంట్రోల్ విభాగం పూర్తి పారదర్శకంగా వ్యవహరించి ఉంటే కార్పొరేషన్‌కు అందించిన పుష్‌కార్ట్స్ నాశిరకం అని అప్పుడే తెలిసేది. కేవలం పొడవు, వెడల్పు, రేకు మందం, పెయింటింగ్ పరిశీలించి అనుమతి పత్రం ఇవ్వడంతో ఆ వస్తువుల నాణ్యత బయటపడే అవకాశం లేకుండా పోయింది. గుత్తేదారు తయారు చేయించిన వస్తువుల నాణ్యతను పూర్తిగా పరిశీలించక పోవడంతో నాశిరకం వస్తువులు అందాయి. టెండర్ నమూనాలో పేర్కొన్న ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే క్వాలిటీ కంట్రోల్ టెస్ట్ సర్టిఫికెట్ జారీ చేసినట్లుగా జెఎన్‌టియు క్వాలిటీ కంట్రోల్ విభాగం సంతకాలు చేసి సర్టిఫికెట్ జారీ చేయటంతో కార్పొరేషన్‌కు నాశిరకం పుష్ కార్ట్స్ వీల్ బార్స్ వచ్చాయి. ఇప్పటికైనా అధికారులు వీల్‌బార్ పుష్‌కార్ట్స్‌ను సమగ్ర తనిఖీ చేసి, నాణ్యతా ప్రమాణాలను గుర్తించాలని పలువురు కోరుతున్నారు. లేకుంటే రూ.34 లక్షల ప్రజాధనం దుర్వినియోగం అయినట్లే అన్న వాదన వినిపిస్తోంది.

పశువుల దాణా కేంద్రాల తనిఖీ

ప్రజాశక్తి-అనంతపురం

వ్యవసాయ శాఖ కమిషనర్, కలెక్టర్ ఆదేశాల మేరకు పలు దాణా దుకాణాలు, పాల పదార్థాల దుకాణాలను ఎడిఎ ఎం.రవి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాలపదార్థాల్లో యూరియా కల్తీ జరుగుతోందని వస్తున్న ఆరోపణల నేపథ్యంలో అనంతపురం డివిజన్ పరిధిలోని దాణా తయారీ కేంద్రాలు, పాల పదార్థాల తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం మండల వ్యవసాయ అధికారి జె.శశికళ, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను వెంటాడిన కష్టం..!

ఐదేళ్లక్రితం తల్లి ...ఇప్పుడు తండ్రి మరణం - అనాథలైన ఇద్దరు కుమారులు



మరణించిన భార్యా భర్తలు అంజలి, ఆంజనేయులు(ఫైల్ ఫోటో)

అమ్మానాన్నల ఆలనలో సంతోషంగా గడపాల్సిన ఆ చిన్నారులను కష్టం వెంటాడింది. కంటికి రెప్పలా చూసుకునే తల్లిదండ్రులు ఒకరి తర్వాత ఒకరు మరణించారు. బాల్యపు పసితనంలో ఓలలాడాల్సిన ఆ చిన్నారులు అనుకోని కష్టంతో అనాథలుగా మరారు. ఐదేళ్ల క్రితం అనారోగ్యంతో తల్లి మృతి చెందగా, శనివారం నాడు తండ్రీ కూడా గుండెపోటుతో ప్రాణాలు వదిలాడు. కనీసం తండ్రి మృతదేహానికి అంత్యక్రియలు ఎలా నిర్వహించాలో తెలియక ఆ పసిమనసులు తల్లడిలాయి.

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కళ్యాణదుర్గం పట్టణం సిద్దప్పవంకకు చెందిన ఆంజనేయులుకు శెట్టూరు మండలం యాటకల్లు గ్రామానికి చెంతిన అంజలితో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి త్రిలోక్, శివకుమార్ ఇద్దరు కుమారులు ఉన్నారు. ఐదేళ్ల క్రితం కరోనా సమయంలో అనారోగ్యంతో తల్లి అంజలి మృతిచెందింది. తండ్రి ఆంజినేయులు కూడా అనారోగ్యంతో కాలం వెళ్లదీసేవాడు. ఈ క్రమంలో అంజలి సోదరీమణులు జయలక్ష్మి, శ్యామల ఆ ఇద్దరు కుమారుల ఆలనపాలనను బాధ్యతగా తీసుకున్నారు. యాటకల్లులో ఉన్న జయలక్ష్మి త్రిలోక్‌ను, ఆ పక్కన గ్రామం మంగంపల్లిలో ఉన్న శ్యామల శివకుమార్‌ను వారి ఇంటికి తీసుకెళ్లారు. యాటకల్లు జెడ్పీ హైస్కూల్‌లో ఈ చిన్నారులు ఒకరు 9వ తరగతి, మరొకరు 8వ తరగతి చదువుతున్నారు. వేసవి సెలవులు కావడంతో ఇద్దరు కుమారులు కళ్యాణదుర్గం పట్టణంలో తండ్రి వద్దకు ఇటీవల వచ్చారు. ఈ క్రమంలో శనివారం ఉదయం ఈ పిల్లల కళ్లేదుటే తండ్రి ఆంజనేయులు గుండెపోటుతో మరణించాడు. తల్లి లేకున్నా తండ్రి ఉన్నాడన్న ధైర్యంతో ఉన్న చిన్నారులకు ఆ ఆసరగా కూడా లేకుండా పోయింది. అచేతనంగా ఉన్న తండ్రిని చూస్తూ చిన్నారులు రోధిస్తున్న తీరు చూపురులను సైతం కంటతడి పెట్టించింది. తండ్రి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు సైతం కుమారులు ఇతరుల సహాయ సహకారాలు తీసుకోవాల్సిన దయనీయ స్థితి నెలకొంది.



అనాథలైన పిల్లలు త్రిలోక్‌నాథ్, శివకుమార్

స్పందించిన మార్కెట్‌యార్డు డైరెక్టర్

తల్లిదండ్రులు ఇద్దరూ కోల్పోయిన చిన్నారుల విషయం తెలుసుకున్న మంగంపల్లికి చెందిన మార్కెట్ యార్డు డైరెక్టర్ కుబేర్‌యాదవ్ ఫోన్‌లో బాధితులకు ధైర్యం చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి చిన్నారులకు అన్ని విధాలా సహకారాన్ని అందిస్తామని భరోసా ఇచ్చారు.

రంగనాథస్వామి పేరుతో స్వాహాకు యత్నం..!

'తొండపాడు'లో అక్రమ వసూళ్లు - అనధికారికంగా చలానాలు

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని తొండపాడు గ్రామంలో వెలిసిన బొలికొండ రంగనాథ స్వామి ఆలయంలో కొందరు డబ్బు స్వాహా చేసేందుకు పన్నాగం పన్నారు. 2019లో జీవోను సాకుగా చూపి ఆలయంలో టికెట్ల విధానంతో డబ్బు వసూళ్లకు తెరలేపారు. పలు గ్రామాలకు చెందిన ప్రజలు పండుగలకు ఆలయాన్ని సందర్శించి దైవదర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేస్తుంటారు. అలాగే ప్రతి ఏటా తొమ్మిది రోజులపాటు జరిగే ఉత్సవాలకు రాష్ట్రంతోపాటు తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. గతంలో కళ్యాణం, ప్రత్యేక దర్శనం, ఆకు పూజ, అభిషేకం, పుట్టువెంట్రుకలు తీయించుట, వాహనాలకు పూజ తదితర పూజలు ఉచితంగా ఉండేవి. ప్రస్తుతం దర్శనానికి రూ.5, ప్రత్యేక దర్శనం రూ.20, ఆకుపూజ రూ.20, తలనీలాల కట్టడి రూ.10, ద్విచక్ర వాహన పూజ రూ. 50, నాలుగు చక్రాల వాహనాల పూజ రూ.100, పుట్టు వెంట్రుకలు తీయడానికి రూ.100, అభిషేకం రూ.100, వివాహ కట్టడి రుసుం రూ.500 వసూలు చేస్తున్నారు. దేవాదాయ శాఖ కమిషనర్ పేర సేవా టికెట్ వివరాల బోర్డును కూడా రంగనాథ స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేశారు. అయితే భక్తులకు ఇచ్చే టికెట్లకు సంబంధించి దేవాదాయశాఖ కానీ బొలికొండ రంగనాథ స్వామి పేరు లేకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆ సొమ్ము ఎక్కడికి వెళ్తుందని ప్రజలు అంటున్నారు. ప్రస్తుత తీవ్ర వర్షాభావంతో పంటలు దిగుబడులు రాక ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న రైతులు, ఉపాధి హామీ కూలీలు, సామాన్యులు డబ్బు పెట్టి స్వామిని ఎలా దర్శించుకుంటారని అర్చకులు చెబుతున్నారు. టికెట్ల విధానాన్ని రద్దు చేసి ఉచిత దర్శనం కల్పించాలన్నారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు.



రంగనాథస్వామి ఆలయం, (ఇన్‌సెట్‌లో) అనధికారికంగా ఇచ్చిన రసీదు.



విలేకరులతో మాట్లాడుతున్న అర్చకులు

గదుల అద్దెలు సొమ్ము ఎక్కడికి వెళ్తుంది..

ఆలయ ఆవరణలో ఉన్న గదులు, కమ్యూనిటీ హాల్ కు సంబంధించిన అద్దెలు కొందరు వసూలు చేసుకుని స్వాహా చేస్తున్నారని సమాచారం. ఆలయానికి సంబంధించి దాదాపు 20 గదులు, ఒక కమ్యూనిటీ భవనం ఉంది. కమిటీ భవనానికి శుభకార్యానికి రోజుకు రూ.7వేలు నుంచి రూ. 9వేలు వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే ఒక్కో గదికి రోజుకు రూ.250 నుంచి రూ.350 వసూలు అవుతోంది. ఆ సొమ్మును కొందరు స్వాహా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి ప్రస్తుతం నిర్వహణాధికారి లేరు. ఇప్పటికైనా దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఆలయంపై దృష్టి సారించి వసూళ్ల పర్వానికి అడ్డుకట్ట వేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

నేడు మార్కెట్ యార్డు పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ఏర్పాట్లను పరిశీలించిన విప్ కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం రూరల్

పట్టణంలోని మార్కెట్ యార్డులో ఆదివారం చేపట్టనున్న ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈమేరకు యార్డులో ఏర్పాట్లను విప్ కాలవ శ్రీనివాసులు శనివారం పరిశీలించారు. సుమారు పదివేల మంది దాకా కూటమి నాయకులు, కార్యకర్తలు రానున్నట్లు కాబోయే మార్కెట్ యార్డు చైర్మన్ హనుమంతురెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు ప్రమాణ స్వీకారం ఉంటుందన్నారు. కాగా పట్టణంలోని కణేకల్ రోడ్డు మార్కెట్ యార్డు నుంచి లక్ష్మీబజార్ వరకూ రోడ్డుకు ఇరువైపులా శుభాకాంక్షలు తెలుపుతూ భారీ ఫ్లెక్సీలు వెలిశాయి. పాలకవర్గం కమిటీలో గౌరవాధ్యక్షులుగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ఛైర్మన్‌గా హనుమంతురెడ్డి, వైస్ ఛైర్మన్‌గా దానవేంద్ర, 13 మంది సభ్యులు, పిఏసిఎస్ ప్రెసిడెంట్, అగ్రికల్చర్ ఎడిఎ మార్కెటింగ్ ఎడి, రాయదుర్గం పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ ఎక్స్‌అఫీషియో సభ్యులుగా కొనసాగుతారని మార్కెట్ యార్డు కార్యదర్శి శ్రీనివాసులు తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న ఐద్వా మహిళలు

గుత్తి : జిల్లాలోని ఏడుగుర్రాలపల్లిలో దళిత మైనర్ బాలికపై లైంగిక దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా మండల కార్యదర్శి ఎన్.రేణుక డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని గాంధీ కూడలిలో శనివారం ఐద్వా ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో బాలికలు, మహిళలపై దాడులు, అత్యాచారాలు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని అరికట్టాల్సిన ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి యు. మల్లికార్జున, ఐద్వా నాయకురాళ్లు శారద, పార్వతీ, రమణమ్మ, నాగరత్న, సిపిఎం నాయకులు మారి, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో 'ఎస్ఆర్' విద్యార్థుల ప్రభంజనం

అనంతపురం కలెక్టరేట్ : ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి ప్రభంజనం సృష్టించారు. అద్భుతమైన ఫలితాలు తమ విద్యార్థులు సాధించడం పట్ల ఎస్ఆర్ కళాశాల చైర్మన్ ఎస్.వరదారెడ్డి, డైరెక్టర్లు ఎన్.సంతోష్‌రెడ్డి, ఎన్.మధుకర్‌రెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు జి.ఇంద్రాని, బి.రాహుల్‌యాదవ్, కె.రేవతి 466, ఈ.ఆకాష్‌రెడ్డి, జి.అభిషేక్ రెడ్డి, ఈ.ఆకాష్‌రెడ్డి, బి.జోహారా, సి.నేహాలు 465 మార్కులు సాధించారని తెలిపారు. మంచి ఫలితాలు సాధించేందుకు బోధన అందించిన అధ్యాపక బృందానికి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ జూనియర్ కళాశాల జోనల్ ఇన్‌ఛార్జి ఎం.శివకుమార్, డీన్ కె.రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఆర్డీటీని కాపాడుకుందాం

శెట్టూరు పరిధిలోకి ప్రవేశించిన రంగయ్య పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

జిల్లాలో రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు (ఆర్డీటీ)ని కాపాడుకోకపోతే చాలా ఇబ్బందులు ఎదురవుతాయని మాజీ ఎంపీ, నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య అన్నారు. శనివారం 4వరోజు పాదయాత్ర బ్రహ్మసముద్రం మండలం సుగేపల్లి, కొనాపురం గ్రామాల నుంచి శెట్టూరు మండలం యాటకల్లు, చిన్నంపల్లి గ్రామాల మీదుగా సాగింది. రాత్రి బొచ్చుపల్లికి చేరుకుని బసచేశారు. ఈ సందర్భంగా రంగయ్యతోపాటు సీనియర్ నాయకులు ఉమామహేశ్వర్‌నాయుడు, రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, తదితరులకు శెట్టూరు మండలం యాటకల్లు వద్ద వైసిపి నాయకులు, ఆర్డీటీ లబ్ధిదారులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల పైబడి ఆర్డీటీ సంస్థ కళ్యాణదుర్గం ప్రాంతంతోపాటు ఉమ్మడి అనంతపురం జిల్లా అంతటా పలు సేవా కార్యక్రమాలు చేస్తోందన్నారు. అలాంటి సంస్థకు ఇతర దేశాల నుంచి వచ్చే నిధులను నిలిపేస్తే పేదలు ఇబ్బంది పడతారన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు గమనించి ఆర్డీటీకి విదేశీ నిధుల పునరుద్ధణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ పాదయాత్రలో ఎంపిపిలు, సర్పంచులు, ఎంపిటిసిలు, మండల కన్వీనర్లు, నాయకులు, ఆర్డీటీ లబ్ధిదారులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య విద్యాసంస్థలను సీజ్ చేయాలి

డిఇఒకు ఐక్య విద్యార్థి సంఘాల నేతల వినతి



డిఇఒకు సమస్యలను వివరిస్తున్న ఐక్య విద్యార్థి సంఘాల నేతలు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతూ ముందస్తు ప్రచారాలు చేస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్న శ్రీచైతన్య విద్యాసంస్థలను సీజ్ చేయాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం విద్యార్థి సంఘాల నేతలు జిల్లా విద్యా శాఖ అధికారి ఎం.ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ అనంతపురంలోని రుద్రంపేట బైపాస్ వద్ద ఉన్న శ్రీచైతన్య 10వ బ్రాంచ్‌కి అనుమతి లేదన్నారు. పాములరాయిలో నిర్వహిస్తున్న శ్రీచైతన్య పాఠశాల సిబిఎస్ఇకి అనుమతి లేకపోయినా తల్లిండ్రులకు సిబిఎస్ఇ అని మాయమాటలు చెబుతూ తప్పుడు ప్రచారాలు నిర్వహిస్తూ అడ్మిషన్లు చేసుకుంటూ కర్నూలులో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. అలాగే నగరంలో గుల్జార్‌పేటలో ఉన్న శ్రీ చైతన్య 8వ బ్రాంచ్‌కి 8, 9, 10వ తరగతులకు అనుమతులు లేకపోయినా విద్యార్థులను చేర్చుకుని తరగతులు నిర్వహిస్తున్నారని వివరించారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్మకూడదని ఉన్నప్పటికీ వాటిని తుంగలో తొక్కుతూ జిల్లావ్యాప్తంగా పుస్తకాలకు టెక్నో, సి బ్యాచ్, ఐకాన్, ఐపిఎల్, ఎంపిఎల్ గ్రూపుల పేర్లు ఏర్పాటు చేసుకుని రూ.10వేల నుంచి రూ.22 వేల వరకూ పుస్తకాలను డోర్ డెలివరీ చేస్తున్నారని వివరించారు. జిల్లావ్యాప్తంగా శ్రీచైతన్య విద్యాసంస్థల్లో అర్హతలు లేని వారిని ప్రిన్సిపాల్‌గా నియమించుకున్నారన్నారు. వెంటనే విచారించి జిల్లాలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న శ్రీ చైతన్య విద్యాసంస్థలను సీజ్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన, కార్యదర్శులు ఓతూరు పరమేష్, కుళ్లాయిస్వామి, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థి సమైక్య రాష్ట్ర కార్యదర్శి సురేష్‌యాదవ్, ఎఐఎస్‌బి నాయకులు విజయ్, ఎస్ఎఫ్ఐ నాయకులు శివ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రోత్సాహం : విప్ కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

గ్రామీణ యువతలో క్రీడల్లో ఉత్సాహం, ఆసక్తి పెంపొందించటానికి కాలవ ఫౌండేషన్ కృషి చేస్తోందని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. కాలవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తనయుడు కాలవ భరత్ సారథ్యంలో నిర్వహిస్తున్న కెసిఎల్ -2 క్రికెట్ లీగ్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ క్రీడలతో యువతలో కలిసి పని చేసేతత్వం, సమాజంపై సేవా దృక్పథం అలవడుతాయన్నారు. క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించడమే పోటీల ప్రధాన లక్ష్యమన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. ఎవరు గెలిచినా వారంతా రాయదుర్గం వాసులేనని గుర్తించుకోవాలన్నారు. లీగ్ పోటీలు ముగిసిన తరుణంలో సెమీ ఫైనల్ కు ఎంపికైన జట్లు తమలోని లోటుపాట్లను సరిదిద్దుకుని మరింత మెరుగైన క్రీడా ప్రదర్శన చేయాలన్నారు. సాధించాలనే పట్టుదల, అంకితభావం ఉన్నంత శిఖరాలు చేరుకోటానికి దోహదపడతాయన్నారు. ఈ పోటీలకు అనూహ్యమైన స్పందన రావడం ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు 205 జట్లు పోటీల్లో పాల్గొన్నాయన్నారు. అందరి ఆదరాభిమానాలతో కెసిఎల్ భవిషత్‌లో నిర్వహించే కార్యక్రమాల్లోనూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలవ భరత్, రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగేళ్ల వెంకటేశులు, టిడిపి నాయకులు గిరిమల్లప్ప, హనుమంతు, సన్నన్న, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోండి : సిపిఎం

ప్రజాశక్తి-గుంతకల్లు



గాయపడిన కార్మికుడిని పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

పట్టణంలో విద్యుత్ శాఖలో పని చేస్తున్న పోల్ టు పోల్ కాంట్రాక్టు కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పాత గుంతకల్లు ప్రాంతంలో విధులు నిర్వహణలో భాగంగా మస్తాన్ అనే కార్మికుడు విద్యుత్ స్తంభం ఎక్కగా కరెంట్ షాక్ కొట్టి కిందికి పడటంతో కాలు విరగడమే కాకుండా తలకు బలమైన గాయమైంది. దీంతో స్థానికులు, సిబ్బంది వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. సమాచారం అందుకున్న సిపిఎం నాయకులు ఆసుపత్రికి వెళ్లి కార్మికుడిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కూడా ఇలాంటి ప్రమాదాలు జరిగి కార్మికులు ప్రమాదాల బారిన ఘటనలు అనేకంగా ఉన్నాయన్నారు. లైన్‌మెన్ ఎల్‌సి తీసుకున్నామని చెబుతూ ఉంటారని అయితే కార్మికులు విద్యుత్ స్తంభం ఎక్కిన తర్వాత విద్యుత్ సరఫరా అయి షాక్ కొట్టి ప్రమాదానికి గురవుతున్నారన్నారు. పోల్ టు పోల్ కార్మికుల ప్రమాదాలకు అధికారులే పూర్తి బాధ్యత వహించాలన్నారు. అలాగే గాయపడిన కార్మికుడు మస్తాన్‌కు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించడంతోపాటు కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యుడు సురేంద్రబాబు, పట్టణ కమిటీ సభ్యుడు రామునాయక్, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

11న మెగా జాబ్‌మేళా

శింగనమల : నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించేందుకు ఈనెల 11వతేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించను న్నట్లు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించడమే లక్ష్యంగా మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు మెగా వైద్యశిబిరం

యాడికి : మండల కేంద్రంలోని గుత్తి రోడ్డులో ఉన్న స్టార్ పారడైజ్ హైస్కూల్లో ఆదివారం ఉచిత ఊపిరితిత్తుల మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు లయన్స్ క్లబ్, మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ వారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మతసామరస్యాన్ని కాపాడుకుందాం

సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి



ముస్లిములకు నీరు అందిస్తున్న రామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మతసామరస్యానికి కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి పిలుపునిచ్చారు. బక్రీద్ పండుగ సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో హెచ్‌ఎల్‌సి కెనాల్ ఈద్గా మైదానం వద్ద ప్రార్థనలకు వచ్చిన ముస్లిములకు తాగునీరు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన రాష్ట్రంలో మతవిద్వేషాలను రెచ్చగొట్టి, మత కల్లోలాలను సృష్టించడానికి ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్ వంటి సంస్థలు చేస్తున్న ప్రయత్నాలకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లాంటివారు తోడ్పడుతున్నారని విమర్శించారు. హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు అందరూ కలిసి ఐక్యంగా ఎదుర్కోవాల్సిన ఉగ్రవాదాన్ని మతం రంగు పులమడం మంచిది కాదన్నారు. జాతీయ ఐక్యతకు, మతసామరస్యానికి ఇవి తోడ్పడదన్నారు. అన్నిమతాల ప్రజలు కలిసి మెలిసి రాష్ట్ర అభివృద్ధి కోసం కృషి చేసే విధంగా తోడ్పడాలని కోరారు. రాష్ట్రంలో ప్రజల మధ్య చిచ్చు రగిలించాలని ఎవరు చూసినా వారికి సరైన రీతిలో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు ప్రకాష్, జీవ, రాజు, మసూద్, ఇందిరా గాంధీ నగర్ శాఖ కార్యదర్శి అంజి, మోహన్, వన్నూరప్ప, బాబు, తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ఆత్మకూరు : మండలంలో మామిడి పంట సాగు చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం శివశంకర్ డిమాండ్ చేశారు. ఈమేరకు రైతులతో మామిడి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లతామర, పురుగుతో మామిడి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఏ తోటలో, ఏ చెట్టును పరిశీలించినా నల్లతామర పురుగు ధాటికి పూత ఎండిపోయిందన్నారు. ఇప్పటికే నాలుగైదు సార్లు మందులు కొట్టినా ఎలాంటి ఫలితం లేకుండా పోయిందన్నారు. అరకొర మామిడికాయలు కాసినా గిడ్డబాట ధర లేక రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున ప్రభుత్వం స్పందించి మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

అత్యాచార నిందితులను శిక్షించాలి

కళ్యాణదుర్గం టౌన్ : సత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లి గ్రామంలో దళిత బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ, జెఎసి, ఎంఆర్‌పిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దళిత బాలికపై 14 మంది అత్యాచారం చేయడం బాధాకరమన్నారు. పేద దళిత కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని పోలీస్ ఉన్నతాధికారులు గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, జెఎసి తాలూకా అధ్యక్షులు చెలిమప్ప, ఎంఆర్‌పిఎస్ తాలూకా అధ్యక్షులు చింతర్లపల్లి మైలారప్ప, గోవిందప్ప, రామన్న, దుర్గప్ప, సురేష్ పాల్గొన్నారు.

వారిది 'వెన్నుపోటు'.. వీరిది 'అభివృద్ధి'..!

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కాలం పూర్తయిన నేపథ్యంలో ఈ నెల 4వ తేదీన ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధికార, ప్రతి పక్ష పార్టీలు పోటాపోటీగా కార్యక్రమాలు చేపట్టారు. ప్రతిపక్ష వైసిపి ఆధ్వర్యంలో 'వెనుపోటు దినం' నిరసన కార్యక్రమాలను చేపట్టి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. అధికార కూటమి పార్టీ ఆధ్వర్యంలో ఏడాది పాలన అభివృద్ధి విజయోత్సవ కార్యాక్రమాలను నిర్వహించి సంబరాలను చేసుకున్నారు. వైసిపి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాలను చేపట్టారు. అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన ర్యాలీలను చేపట్టారు. అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా నియోజకవర్గ సమన్వయకర్తలు పాల్గొన్నారు. చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలను గుర్తు చేస్తూ వైసీపీ నాయకులు ప్రసంగించారు. బాబు షూరిటీ ఇస్తే మోసం గ్యారంటీ అంటూ నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. సూపర్-6 అమలు జరగలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం పాలనలో అన్ని విధాలా విఫలం అయ్యిందని నిరసన గళం విన్పించారు. ప్రతిపక్ష పార్టీ విమర్శలను తిప్పికొట్టేలా కూటమి నేతలు కూడా ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధిని తెలియజేస్తూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంబరాలు చేసుకున్నారు. కూటమి స్వర్ణయుగం పాలన పేరుతో అన్ని మండల కేంద్రాల్లో విజయోత్సవ సంబరాలను టిడిపి, జనసేన, బిజెపి పార్టీల ఆధ్వర్యంలో చేసుకున్నారు. కేక్‌లు కట్ చేసి సంబరాలు జరిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ప్రజలకు అందించిన సంక్షేమాన్ని నాయకులు తెలియజేశారు. పింఛన్ వెయ్యి రూపాయల పెంపు, ఉచిత గ్యాస్, నూతన మద్యం, ఇసుక పాలసీ తదితర వాటిని అమలు చేసి ప్రజలకు మేలు చేశామంటూ కూటమి నాయకులు పేర్కొన్నారు. మోసం, వెన్నుపోటుకు కేరాఫ్ జగన్మోహన్‌రెడ్డి అంటూ విమర్శలు గుప్పించారు.

రాజకీయవేడి

ఎప్పటిలాగే ఈ వారం కూడా జిల్లాలో రాజకీయవేడి కన్పించింది. తాడిపత్రి నియోజకవర్గానికి సంబంధించి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వెన్నుపోటు దినంలో పాల్గొనేందుకు ఆయన స్వగ్రామం తిమ్మంపల్లి నుంచి బయల్దేరారు. శాంతిభద్రతల నేపథ్యంలో అక్కడికి వెళ్లేందుకు వీల్లేదంటూ పోలీసులు ఆయన్ను గృహ నిర్బంధం చేశారు. ఈ సమయంలో పెద్దారెడ్డి పోలీసులపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా పోలీసులు ఆయన్ను ఆ కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఇక అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో టిడిపి నాయకుడు సుధాకర్ నాయుడు సొంత పార్టీ నాయకులపేనే బాంబు పేల్చాడు. ఎమ్మెల్యే దగ్గుపాటి అనుచరులు తనను చంపేందుకు కుట్ర చేశారంటూ ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు పెనుసంచలనం రేపింది. ఈ విషయం తెలుసుకున్న టిడిపి అధిష్టానం వెంటనే సుధాకర్ నాయుడుతో పాటు అర్బన్ ముఖ్య నేతలు అందరినీ పిలిపించుకుని మాట్లాడింది. పార్టీకి నష్టం కలిగించే చర్యలు తీసుకోవడంపై గట్టిగానే నేతలను మందలించినట్లు సమాచారం.

కోవిడ్ కలవరం

జిల్లాను మరోసారి కోవిడ్ కలవరపెట్టింది. ఈ వారంలో ఉమ్మడి జిల్లాలో కోవిడ్ పాజిటివ్ కేసులు ప్రజలను ఆందోళన కలిగించాయి. అనంతపురం పాతూరు చెందిన గర్భిణి దగ్గు, జలుబు లక్షణాలతో ఉండగా సర్వజన ఆసుపత్రిలో కోవిడ్ పరీక్షలు చేయగా పాజిటివ్‌గా తేలింది. దీంతో ఆమెను హోమ్ ఐసోలేషన్‌లో ఉంచారు. అదే విధంగా ధర్మవరానికి చెందిన గర్భినికి ఓ ప్రయివేటు ఆసుపత్రిలో కోవిడ్ పరీక్షలు చేయగా పాజిటివ్ వచ్చింది. అయితే ఆమెకు మళ్లీ సర్వజన ఆసుపత్రిలో కోవిడ్ టెస్ట్ చేయడంతో నెగిటివ్ వచ్చింది. కోవడ్ కేసులు నమోదు నేపథ్యంలో జిల్లా వైద్యాధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థికసాయం

కళ్యాణదుర్గం రూరల్ : ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్ మండలంలోని బోరంపల్లి గ్రామానికి చెందిన బోయ పాలన్న కుటుంబానికి రూ.20వేలు ఆర్థికసాయం అందించారు. కూలి పని చేసుకుని జీవనం సాగించే పాలన్న అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. టిడిపి యువ నాయకుడు మీసేవా బాబు ద్వారా విషయం తెలుసుకున్న బద్దేనాయక్ బాధితుడికి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వైస్‌ఛైర్మన్ సురేష్, గ్రామస్తులు బోయ మారెప్ప, అనం రంగారెడ్డి, చాకలి వెంకటేష్, డీలర్ గోపాల్, ఎర్రిస్వామి, బ్రహ్మయ్య, నారాయణ, శ్రీనివాసులు, మల్లికార్జున, ఫీల్డ్ అసిస్టెంట్ రామాంజినేయులు, కుళ్లాయి, రాజు, గంగాధర్, సన్నప్పయ్య, తదితరులు పాల్గొన్నారు.

9న తలనీలాల వేలంపాట

నార్పల : మండల పరిధిలోని గూగూడు కుళ్లాయిస్వామి ఆలయంలో భక్తులు సమర్పించే తలనీలాల పోగుకు ఈనెల 9వతేదీన వేలంపాట నిర్వహించను న్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకేతపురం శోభ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో మూడుసార్లు తేదీలు ప్రకటించినా పాటదారులు ఎవరూ హాజరు కాకపోవడంతో ఈనెల 9న తిరిగి వేలంపాట నిర్వహించనున్నట్లు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

శింగనమల : మండలంలోని గురుగుంట్ల గ్రామంలో మృతిచెందిన మాచర్లప్ప కుటుంబానికి నాగులగుడ్డం వెంకటరమణ శనివారం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. ముందుగా మృతదేహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ

బుక్కరాయసముద్రం : శింగనమల నియోజకవర్గ పరిధిలోని పలువురికి మంజూరైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అనంతపురంలోని తమ క్యాంపు కార్యాలయంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పలువురు బాధితులకు రూ.9,37,003 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. పేదలు ఇబ్బందులు పడకుండా మెరుగైన వైద్యం అందించాలనే ప్రభుత్వం సిఎం సహాయ నిధి నుంచి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు.

పలువురు టిడిపిలో చేరిక

గుత్తి : మండలంలోని టి.కొత్తపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకులు శనివారం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్, ఆయన తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి టిడిపి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలోకి చేరిన వారిలో మేరసాని చిన్న సుంకన్న, ఎం.పెద్ద సుంకన్న, ఎం.అగ్గన్న, చిలక నారాయణ, మద్దిలేటి, తిమ్మప్ప, రంగనాథ, పెద్ద సుంకన్న, నరేష్, చిన్న హనుమంతు, నాగ రంగయ్య, సుజాత, నాగేంద్రమ్మ, నాగలక్ష్మి, ఓబులేసు, తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ ఎంకె. చౌదరి, తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి జక్కలచెరువు ప్రతాప్, ఆసుపత్రి అభివద్ధి కమిటీ సభ్యుడు చికెన్ శ్రీనివాసులు, సర్పంచి యు.రామలింగమయ్య, నాయకులు మద్దిలేటి, తిమ్మప్ప, రామచంద్ర, వెంకటరమణ, బాలయ్య, ఆంజనేయులు, రామాంజి సాంబశివ యాదవ్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలు

ఉరవకొండ : టెన్త్ ఇంటర్ పరీక్షల ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శనివారం ఉరవకొండలోని ఎస్‌కెఆర్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి గవిమఠం ఉత్తరాధికారి కరిబసవ రాజేంద్రస్వామి, మండల విద్యాశాఖ అధికారులు క్లబ్ అధ్యక్షులు ఎర్రిస్వామి హాజర య్యారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కెఆర్‌సి సీనియర్స్ సభ్యులు, ఉపాధ్యక్షులు నాయుడు, కార్యదర్శి సి.రవీంద్రనాథ్, జాయింట్ సెక్రటరీ రమేష్‌బాబు పాల్గొన్నారు.

విద్యా మాఫియాను అరికట్టడంలో విఫలం : ఎస్ఎఫ్ఐ



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రాయదుర్గం : నియోజకవర్గ వ్యాప్తంగా ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థల చేస్తున్న అధిక ఫీజుల దోపిడీని అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ ఆరోపించారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్లు, పాఠ్యపుస్తకాల పేరుతో వేలకు వేలు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. కార్పొరేట్ యాజమాన్యాలు ప్రభుత్వాలను శాసించే పరిస్థితికి రావడం బాధాకరమన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా కార్పొరేట్, ప్రయివేట్ వ్యవస్థలో మార్పులు తీసుకురావడంలో విఫలమవుతున్నారన్నారు. ఇప్పటికైనా నియోజకవర్గంలోని కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల ఫీజులు, పాఠ్య పుస్తకాలు దోపిడీని అరికట్టాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు గౌతమ్, వల్లి, అనిల్, సాయి, విష్ణు, గణేష్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



దగ్ధమైన చెరుకు తోట

చెరుకుతోట దగ్ధం

పెద్దవడుగూరు : మండలంలోని మేడిమాకులపల్లిలో కంబగిరికి చెందిన చెరకుతోటను శనివారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టి దగ్ధం చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. తన మూడేకరాల పొలంలో చెరకుపంటను సాగుచేసి కోతకు సిద్ధమై చేతికొచ్చే సమయంలో ఇలా దగ్ధం కావడంతో రైతు సుమారు రూ. 4 లక్షల మేరకు నష్టపోయానన్నారు. తనకు గ్రామంలో ఎవరితో గొడవలు లేవని.. తనను ఆర్థికంగా నష్టపరిచేలా చేశారా లేక ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగల నుంచి మంటలు వ్యాపించి కాలిపోయిందా అనే విషయాలు తెలియాల్సి ఉందని పోలీసులకు వివరించారు. విషయం తెలుసుకున్న టిడిపి మండల యువ నాయకుడు దివాకర్‌రెడ్డి చెరకు తోటను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలిపోయిన చెరకు తోటను ఎస్ఐ ఆంజనేయులు పరిశీలించి విచారణ చేపట్టారు.